క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గ చేతి వృత్తుల విభాగం అధ్యక్షుడిగా ఆరాణి ఆంజనేయులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విశాఖ కార్మిక మహా ర్యాలీని జయప్రదం చేయాలి

యర్రబాలెం(మంగళగిరి): సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో జరిగే కార్మిక మహా ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి పిలుపునిచ్చారు. బుధవారం యర్రబాలెంలో జరిగిన మున్సిపల్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వర్గానికి ఎల్లవేళలా అండగా నిలుస్తున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలు ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్నాయన్నారు. మహాసభల సందర్భంగా జనవరి 4వ తేదీన జరిగే కార్మిక మహార్యాలీలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ఆదిలక్ష్మి, టి.బాబు, ఒ.రామారావు, కె.కోటేశ్వరి, ఎస్.దివ్య, ఎం.పార్వతి, ఎస్కే సుభాని తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువుల ప్రాముఖ్యతపై అవగాహన



దుగ్గిరాల: నానో ఎరువులో గల యూరియా 500 మిల్లీలీటర్ల ద్రావణం 45 కేజీల యూరియాతో సమానం అని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. బుధవారం పేరకలపూడి, ఈమని గ్రామాల్లో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. మొక్క ఎదుగుదలకు ఇది సహకరిస్తోందని.. రైతులు శ్రమ పడకుండా దీనిని తీసుకు వెళ్లవచ్చునని ఆయన వివరించారు. కార్యక్రమంలో సంసోనమ్మ, ప్రజ్ఞాన్‌బాబు, సుధ, అనూష, ఇందిర, రైతులు పాల్గొన్నారు.

గౌరీపుత్రుడికి ఘన వీడ్కోలు



ఆత్మకూరు(మంగళగిరి): ఆత్మకూరు కొత్తపాలెంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. యువ గణేష్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించగా 27 కిలోల లడ్డూ రూ.1,01,116 లకు గ్రామానికి చెందిన తాటి పాముల సాంబశివరావు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు 10 తులాల వెండి వినాయక ప్రతిమను ఆయనకు బహూకరించారు. 5 కిలోల లడ్డూను చిల్లపల్లి జగదీష్ రూ.26,116లకు దక్కించుకున్నారు. అనంతరం కనకతప్పెట్లు, బాణసంచా కాల్పుల మధ్య స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించి రేవేంద్రపాడు కాలువలో నిమజ్జనం చేశారు.

సబ్ ట్రెజరరీలో జీతాలు జాప్యం



దుగ్గిరాల: 1వ తేదీన ఇవ్వవలసిన జీతాలను దుగ్గిరాల సబ్ ట్రెజరరీ పలు కారణాలతో జాప్యం చేస్తోందని.. అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయంలో దుగ్గిరాల, కొల్లిపరకు చెందిన ఉపాధ్యాయులు, సచివాలయం, రెవెన్యూ ఉద్యోగులు తహసీల్దార్ ఐ.సునీతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బి.బ్రహ్మయ్య, వి.ప్రసాద్, రవీంద్ర, దేవకుమార్, భాస్కర్, చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో హౌసెస్‌లో డెంగీ !!

మంగళగిరి: పట్టణంలోని రాజీవ్ గృహకల్ప వద్ద గల టిడ్కో హౌసెస్‌లలో డెంగీ వ్యాధి కలకలం రేపింది. టిప్పర్ల బజార్‌లోని ఓ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో స్థానిక ఆరోగ్య కేంద్రంలో చూపించగా వివిధ రక్త పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో టైఫాయిడ్ అని డాక్టర్లు తెలిపారు. కానీ విద్యార్థికి డెంగీ లక్షణాలు ఉన్నాయని తల్లిదండ్రులు, స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై మంగళగిరి ఏరియా ఆసుపత్రి మలేరియా విభాగం సూపర్‌వైజర్ సాగర్‌ను వివరణ కోరగా.. తమకు సమాచారం లేదని, సమాచారం అందిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకురావాలంటూ తెలిపామని అన్నారు.

ప్రకటనలతో సరి.. నిర్మాణాలు ఎప్పుడు మరి!

- మొదలు కాని నిడమర్రు రైల్వేగేటు పైవంతెన పనులు
- నత్తనడకన క్రికెట్ స్టేడియం నిర్మాణం
- ప్రకటనలతో సరికాదంటున్న స్థానికులు



రైల్వే గేటు సమీపంలో నిలిచిపోతున్న వాహనాలు

మంగళగిరి: మంగళగిరి నుంచి రాజధాని అమరావతితో పాటు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ప్రధాన రహదారి అయిన నిడమర్రు రోడ్డులో ప్రధాన సమస్యగా ఉన్న నిడమర్రు రోడ్డు ఫ్లై ఓవర్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని.. రూ.123 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని గుంటూరు ఎంపీ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జనవరిలో స్థానికంగా పర్యటించిన పెమ్మసాని.. 16 నెలల్లో నిడమర్రు రోడ్డు గేటుపై ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. అదే విధంగా ఏసీఏ అధ్యక్షుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఏడాది క్రితం అమరావతి టౌన్‌షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించి రెండేళ్లలో స్టేడియం నిర్మాణం పూర్తి చేసి అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

ముందుకు సాగని పనులు..

ఎంపీల ప్రకటనలను చూసిన స్థానికులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ ఎంపీల ప్రకటనలు చేసి రోజులు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీంతో వారి ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. రూ.123 కోట్లతో వెంటనే నిడమర్రు రైల్వేగేటు పైవంతెన నిర్మాణం ప్రారంభిస్తున్నామని చేసిన ప్రకటన నేటికీ ప్రకటనగానే మిగిలిపోయింది. ఎలాంటి పనులూ ప్రారంభం కాకపోవడంతో ఇది ప్రకటనల ప్రభుత్వమే కాని.. పనితనం చూపే ప్రభుత్వం కాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి..

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో కీలకమైన నిడమర్రు రైల్వేగేటు పైవంతెన పనులు మొదలవ్వకపోవడం.. ఏసీఏ క్రికెట్ స్టేడియం పనులు నత్తనడకన సాగడంతో కార్పొరేషన్ అభివృద్ధి అటకెక్కినట్టేనని స్థానికులు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఇప్పటికైనా ఎంపీలు, ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా వెంటనే పనులు ప్రారంభించి ఆయా నిర్మాణాలు పూర్తి చేసి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కంతేరు(తాడికొండ): పత్తి పంట ప్రస్తుతం పూత దశలో ఉన్నందున గులాబీ రంగు కాయ తొలుచు పురుగు ఉధృతి పెరుగుతుందని.. వీటి నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరానికి 10 చొప్పున పెట్టుకుని పురుగు ఉధృతి ఎప్పటికప్పుడు గమనించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యూరియా జిల్లాలో 5,500 మెట్రిక్ టన్నుల నిల్వ ఉందని, రైతులు అవసరం మేరకు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈనెల ఆరో తేదీ నుంచి 10వ తేదీ వరకు జిల్లాకు సుమారు 2,000 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నదని.. రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. అవసరం మేరకు మాత్రమే పురుగు మందులు వాడాలని.. కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకొని పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ బి.వి జయరాజు, మండల వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణారావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది హరికృష్ణ రాయలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడికి ఘన నివాళులు



గొల్లపాలెం కార్యక్రమంలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: ప్రజా నాయకుడు జనహృదయనేత రాజన్న అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు(డైమండ్‌బాబు) అన్నారు. దివంగత నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని గొల్లపాలెం, నుదురుపాడు, పొనుగుపాడు, వేమవరం, మేరికపూడి, అల్లంవారిపాలెం, క్రీస్తునగర్ గ్రామాల్లో మంగళవారం రాత్రి రాజన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొల్లపాలెంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, గ్రామసర్పంచి దాసరి మెల్కియా, పార్టీ గ్రామ కన్వీనర్ జొన్నలగడ్డ ఆనందబాబు, స్వర్ణచిన్నప్ప, గుమ్మడి సంగీతరావు, చుక్కా లూర్దురాజు, పి.చిన్న, దార్ల లూర్దయ్య, దార్ల పూర్ణయ్య, సాలెజోసఫ్, చుక్కా రాజబాబు, అల్లాడి కోటేశ్వరరావు, దాసరి ప్రసాద్, కొరగంటి సుదర్శన్, కె.విజయ్, కె.అన్నయ్య, కె.శౌరీలు, జి.రాజు, జి.రాంబాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో మంగళవారం రాత్రి మూడు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితులు వివరించారు. గంటా శ్రీనివాసరెడ్డి, మందాళ సంగిరెడ్డి, పోలిశెట్టి శ్రీనులకు చెందిన ట్రాక్టర్ల బ్యాటరీలు అపహరించుకు పోయాయన్నారు. ఒకే రోజు వివిధ ప్రాంతాల్లో బ్యాటరీల అపహరణకు గురవడంతో వాటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు సుమారు రూ.11 వేలు వరకూ ఉంటుందని చెప్పారు

విశిష్ట సంఖ్యపై రైతులకు అవగాహన



చిర్రావూరు(తాడేపల్లి రూరల్): మండలంలోని చిర్రావూరు గ్రామంలో కౌలు రైతులకు ఫార్మర్ రిజిస్టర్ చేయు విధి విధానాలలో పరిశీలన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అగ్రి స్టాక్ సెంట్రల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సీపీఎంవో సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ సరిత లక్ష్మీ, సీనియర్ టెక్నికల్ డైరెక్టర్ ఎన్ఐసీ ఎస్.చంద్రంలు రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. రైతు విశిష్ట సంఖ్య, కౌలు రైతులకు నమోదు చేయించడానికి విధి విధానాల రూపకల్పనలో భాగంగా సొంత రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయు విధానం గురించి అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేడీఏ పద్మావతి, ఏడీఏ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌పీఎంయూ కార్తీక్, ఏవో నరేష్, మంగళగిరి సబ్ డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, ఏవో శిరీష తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో అధ్వానంగా డొంకరోడ్లు



చిర్రావూరు(తాడేపల్లి రూరల్): మండలంలోని చిర్రావూరు పొలాలలోకి వెళ్లే డొంకరోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు మార్గం ద్వారా తమ పొలాల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, బండ్లు, అరకలు, ట్రాక్టర్లు తీసుకెళుతుంటామని.. 2 కిలో మీటర్ల ఈ రోడ్డులో ప్రస్తుతం కూలీలు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని.. చిన్నపాటి చినుకులకే రోడ్డు నడకయాతనగా ఉందని తెలిపారు. సీసీ రోడ్డు లేదా తారు రోడ్డు నిర్మించాలని రైతన్నలు కోరుతున్నారు.

రాజన్న విగ్రహానికి నివాళులు

నిడమర్రు(మంగళగిరి): దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిడమర్రులో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నిడమర్రు లైబ్రరీ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిడమర్రులో వైఎస్సార్ అంటే ప్రత్యేక అభిమానం ఉంటుందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు బోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, మండల ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు ఈపూరి ఆదామ్, నిడమర్రు పార్టీ నాయకులు కొల్లి శేషిరెడ్డి, బుర్రముక్క సుందర్‌రెడ్డి, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పంపిణీ పుస్తకాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దుగ్గిరాల: పాఠశాల పూర్వ విద్యార్థులు పంపిణీ చేసిన ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీవీ కృష్ణారావు తెలిపారు. బుధవారం రేవేంద్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడారు. 2002–03 విద్యా సంవత్సర 10వ తరగతి పూర్వ విద్యార్థులు 8వ తరగతి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరయ్యే 26 మంది విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందించారని అన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ ఝాన్సీ, జనార్ధనరావు, పూర్వ విద్యార్థులు నాలాది ప్రవీణ్, షేక్ ఇమామ్ ఖాశీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మానసిక సామర్థ్యం శిక్షణా తరగతుల్లో పి.రవికుమార్ పాల్గొన్నారని ప్రధాన ఉపాధ్యాయురాలు ఎస్ శోభాదేవి తెలిపారు. పిల్లల్లో ప్రవర్తన, మానసిక స్థితి, భావోద్వేగాలు, విద్యాపరమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు కావాల్సిన నైపుణ్యాలను ఆయన విద్యార్థులకు వివరించారని శోభాదేవి పేర్కొన్నారు.

బెల్లంకొండ వెంకట్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న బెల్లంకొండ వెంకట్

తెనాలి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగంలోని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యాంశాల్లో అత్యంత ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా యాక్టివిటీస్ శిక్షణలో తెనాలికి చెందిన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ప్రశంసాపత్రం అందుకున్నారు. అత్యంత నాణ్యమైన విద్యాంశాలు, ఉత్తమ ఆచరణ పద్ధతులను సామాజిక మాధ్యమాల వేదికపై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుల్లో గుంటూరుకు చెందిన ముగ్గురు ఎంపికయ్యారు. వీరికి సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌పీడీ శ్రీనివాసరావు ప్రశంసాపత్రం, సోషల్ మీడియా పరికరాన్ని అందజేశారు. బెల్లంకొండ వెంకట్ స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో చిత్రకళ ఉపాధ్యాయుడిగా చేస్తున్నారు. ఎన్‌సీసీ అధికారిగా, గాయకుడిగా, నటుడిగా సమాజాన్ని చైతన్యపరుస్తూ విద్యార్థులను వివిధ రకాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల తరఫున కూటమిపై పోరాటం

- ఎన్నికల హామీలను విస్మరించిన చంద్రబాబు
- నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి

మంగళగిరి టౌన్: కూటమి నాయకుల హామీలను నమ్మి మోసపోయిన ప్రజలకు అండగా ఉందామని.. వారి తరఫున పోరాటం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని 3, 4 వార్డుల్లో బుధవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉన్నది.. ప్రస్తుత చంద్రబాబు పాలన ఎలా ఉన్నది అనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, ఊట్ల పాల శ్రీనివాసరావు, గంజి షణ్ముఖ్, షేక్ మాబు, మాతంగి బాబు, సుబ్బారావు, అంజి, వెంకటేశ్వరరావు, శివ శంకర్‌రావు, ప్రదీప్, సురేష్, వెంకటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమారెడ్డికి అభినందనలు..

ఆత్మకూరు(మంగళగిరి): మండలంలోని ఆత్మకూరులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిని పట్టణ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితురాలైన గోలి వెంకట సుబ్బమ్మ మర్యాద పూర్వకంగా కలిశారు. తమను ప్రధాన కార్యదర్శిగా నియమితులు చేసిన వేమారెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, మహిళా నాయకురాలు కొప్పుల కమల, కొప్పుల తులసి, గోలి భారతి పాల్గొన్నారు.

మితిమీరిన అలవాట్లతో ఫ్లోరోసిస్

జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ కుమార్



విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ గిరిధర్ కుమార్

తాడికొండ: పొగాకు సంబంధిత వస్తువులు, బ్లాక్ సాల్ట్, బ్లాక్‌టీ, బోర్‌వెల్ తాగునీరు వంటివి మితిమీరి ఉపయోగించడం ద్వారా ప్రజలు త్వరగా ఫ్లోరోసిస్ బారిన పడతారని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ అన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు పీహెచ్‌సీ పరిధిలోని దామరపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ బారిన చిన్నారులు పడకుండా ఉండేందుకు పాఠశాలల్లో 3, 4, 5 తరగతి చిన్నారులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని, గ్రామాల్లో కమ్యూనిటీ సర్వే చేయాలన్నారు. నివారణలో భాగంగా రక్షిత తాగునీరు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమ్యూనిటీ హెల్త్ అధికారి పి.ప్రియాంక, సూపర్‌వైజర్‌లు ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

మంగళగిరి: బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీసీల పట్ల వివక్షత చూపుతోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి క్రాంతికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీలపై దాడులు పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తుందని, ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ.. బీసీల కులగణన ఏమైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ, జంజనం వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆశా పోస్టులను భర్తీ చేయాలి



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న దుర్గారావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి యూపీహెచ్‌సీ పరిధిలోని ఉండవల్లి, మహానాడు ప్రాంతాలలో ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆశా వర్కర్లను కలిసి సమస్యలు తెలుసుకున్న దుర్గారావు మాట్లాడుతూ.. ఆల్ ఇండియా సీఐటీయూ మహాసభలు విశాఖపట్నంలో జరగనున్నాయని.. సభల జయప్రదానికి ఆశా కార్యకర్తలు తమవంతు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు వేముల రేణుక, విశాలి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

274వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



దీక్షలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

తాడేపల్లి రూరల్: కార్మిక వర్గం సమన్వయంతో సమస్య పరిష్కారానికి ముందుకు సాగవలసిన అవసరం ఉందని కార్మిక సంఘం నాయకులు స్టీఫెన్ తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం 247వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు వేముల దుర్గారావు, వై.సాంబశివరావు, బి.సూర్యప్రకాష్, షేక్ సుభాని, ఎం.ఆశీర్వాదం, తుపాకుల నాగేశ్వరరావు, కార్మికులు వేముల రోజులు, వేముల రమణమ్మ, మొలక శారద, అలం విజయశ్రీ, ఎం.మరియమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఆత్మకూరు సర్వీసు రోడ్డులో బోల్తా పడిన కారు

ఆత్మకూరు(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు నిర్మలా కాన్వెంట్ సమీపంలో కారు బోల్తా పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన రామారావు తన ఇద్దరు స్నేహితులతో కలిసి విజయవాడ నుంచి గుంటూరు వైపు కారులో వెళుతున్నాడు. ఆత్మకూరు సర్వీసు రోడ్డులో కారు వేగంగా నడపడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న చిన్న కాలువలో బోల్తా పడింది. ప్రమాదంలో రామారావు, ఇద్దరు స్నేహితులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయశాఖ ఏడీఏగా విజయబాబు

తెనాలిటౌన్: వ్యవసాయ శాఖ, తెనాలి ఏడీఏగా రాగాల విజయబాబు బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న విజయబాబు, తెనాలి, కొల్లిపర ఏవోల కన్నా సీనియర్ అయినందున ఆయనను ఇన్‌ఛార్జి ఏడీఏగా నియమించారు.

వ్యర్థాలు కనిపిస్తే చర్యలు

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు కన్పిస్తే సహించేది లేదని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు హెచ్చరించారు. యడ్ల లింగయ్య కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, పూలే కాలనీలలో బుధవారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. కాలనీలోని ప్రతి కాల్వను బాగుచేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.